# నేను అమ్మనవుతాను

-కంచుమర్తి వెంకటేశ్వరరావు

**అనూహ్యా మూడో నెలని డాక్టరు చెప్పడంతో ఆనందంతో ఉక్కిరిబి క్కిరయ్యాడు రాజేంద్ర. గదిలోకి వెళ్ళి అలసి నిదరోతున్న ఆమెను అపురూపంగా చూసేడు. బంగారపు పూత పూసినట్లు పసిడి కాంతితో మెరసిపోతున్న భార్యను మురిపెంగా దగ్గరకు తీసుకుని తనను తండ్రి చేస్తున్నందుకు కృతజ్ఞతగా ముద్దులతో ముంచెత్తా లనే కోరికను ప్రక్కన మామయ్యగారుండడంతో బలవంతంగా ఆపుకున్నాడు.**

రామారావు మంచం మీదు కూర్చుని కూతురు నుదుటిపై పడిన ముంగురులను సవరించి తలను నిమిరాడు. అతనిలో ఏదో అలజడి. ఆపుకోలేని ఆనందం. ఆవేదన..కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు నిలిచాయి. తల నిమురుతున్న అతని చేయి వణికింది. కళ్ళు తెరచింది అనూహ్య.

బేల కళ్ళతో తననే చూస్తున్న నాన్నను చూసి నాన్నా...అని అతని చేయి పట్టుకుంది. నాకు భయంగా ఉంది నాన్నా.. అంది నెమ్మదిగా.

ఆ మాటకు మరింతగా వణికిపోయాడు రామా రావు.

"భయమెందుకమ్మా...నేనున్నానుగా"

అలా అన్నాడేగాని కూతురు ముఖంలోకి ధైర్యంగా చూడలేక పనుందని గదిలోంచి బయటకు వచ్చాడు. వస్తూ అల్లుడి వైపు చూసాడు ఒకసారి బయటకు రమ్మన్నట్లు. రాజేంద్ర అతన్ని అనుసరించాడు.

ఆ ముసలి తండ్రి ఎందుకలా బెంబేలు పడుతు న్నాడో, ఎందుకలా వణికిపోతున్నాడో, ఎందుకలా గుండెల్లో బాధను దిగమింగుకుంటున్నాడో అతనికి తెలుసు.

"అనూహ్యకు ఏదైనా అయితే నేను బ్రతకను రాజేంద్రా. అది నిత్యం నాకళ్ళ ముందుండాలి. పాతిక సంవత్సరాలు కంటికి రెప్పలా, పువ్వులా పెంచుకున్నాను. అనూహ్యలో కూతురనే కాదు కొడుకు, తండ్రి, తల్లి ఇంకా సర్వం చూసుకుని బ్రతుకుతున్నాను. అన్నీ అనూహ్య ఇష్టప్రకారమే చేసాను గానీ పెళ్ళి విషయానికొచ్చేసరికి అందరి ఆడపిల్లల తండ్రుల్లాగే ప్రవర్తించాను. తప్పచేసానే మోనని ఇప్పడు బాధపడుతున్నాను."

రామారావు చిన్న పిల్లవాడిలా ఏడ్చేసాడు.

ఆ సమయంలో అతన్ని ఎలా ఓదార్చాలో తెలి యక, తప్ప చేసినవాడిలా తలవంచి, "క్షమించండి. అనూహ్యను మీరెంత అపురూపంగా పెంచారో అంతకు రెట్టింపు ప్రేమతో నేను చూసుకుంటు న్నాననే సంగతి మీకు తెలుసు. పెళ్ళై ఈ రెండు సంవత్సరాలలో నావలన ఆమె ఎప్పుడైనా బాధప డిందా.."అని ఆగి మళ్ళీ "అనూహ్య నా ప్రాణం.. అమె ఇష్టానికి వ్యతిరేకంగా నేనెప్పుడూ ప్రవర్తిం చలేదు. అయితే తండ్రిని కావాలనే స్వార్థంతో ఆమెకు తెలియకుండా నేను కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతలో అశ్రద్ధ చేసాను. అదే తప్పయితే చెప్పండి. డాక్టర్‌తో మాట్లాడతాను" అనేసి గబగబ అక్కడినుండి వెళ్ళిపోయాడు రాజేంద్ర.

రామారావు అలాగే నిలబడిపోయాడు చాలాసేపు. రాజేంద్ర ఆశపడడంలో తప్పలేదు. అది తప్పని ఎవరూ అనరు. తప్పంతా తనది. తన కూతురుది. తమ స్వార్థమే అతన్ని బాధపెడుతుంది. తమ స్వార్థం వెనుక మూరేళ్ళ కథ ఉంది, మూరెళ్ళ వ్యథ ఉంది, నూరేళ్ళ భవిష్యత్తు దాగి ఉంది. ఈనిజం ఎప్పుడూ తను కప్పిఉంచలేదు. మనసు విప్పి చెప్పడం జరిగింది.

రామారావుకు అనూహ్యంటే ప్రాణం. సంవత్సరం తిరక్కుండానే తల్లిని పోగొట్టుకున్న కూతురును గుండెల మీద పెంచాడు. స్నానం చేయించినా, జోలపాట పాడినా, గోరు ముద్దలు తినిపించినా అన్నీ తనై నడకలు నేర్పించాడు.

చిన్నప్పుడు స్కూలు నుండి రాగానే దిష్టి తీసే వాడు. ఎందుకంటే అనూహ్య అందంలోనే కాదు చదువుల్లో కూడా స్కూలు ఫస్టే. బంగారపు బొమ్మని కొందరంటే, పూలరెమ్మని, వెన్నెల వెలు గని బిరుదులిస్తుంటే తన కూతురుకు ఎక్కడ దిష్టి తగులుతుందోనని కలత చెందేవాడు. కల తలు కన్నీళ్ళు దరిచేరనీయకుండా అపురూపంగా పెంచాడు.

కాలేజికి వెళ్ళేటప్పుడు, సాయంత్రం వచ్చేటప్పుడు వెంట ఉండేవాడు. అసలే అపరంజి బొమ్మ. ఆక తాయి కుర్రాళ్ళు తన కూతురు వెంటబడి అల్లరి చేస్తారేమోననే భయం. అనూహ్య కూడా ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేది కాదు. తండ్రి, ఇల్లు, చదువు తప్ప మరోలోకం లేదామెకు.

అనూహ్య డిగ్రీ అయింతర్వాత పిజి చేస్తానంటే కాదనలేదు. అయితే తను ఈడు తండ్రులందరూ కొడుకులు, కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేస్తున్నారు. తనకా అదృష్టం లేదా. ఆమాటే ఒకసారి అడిగాడు కూతురును.

'నాన్నా...నాకు బ్రతకాలని ఉంది నాన్నా'

అనూహ్య అలా అనగానే గుండె ఆగినంత పని యింది. అనూహ్య అలా ఎందుకందో అతనికి తెలుసు. మళ్ళీ పెళ్ళి ప్రస్తావన తీసుకురాలేదు.

పిజి అయింతర్వాత అనూహ్య బ్యాంకు ఆఫీ సరుగా సెలక్టవడంతో జీవితం మలుపు తిరిగే సంఘటన ఎదురైంది. బ్యాంకు మేనేజరు రాజేంద్ర యువకుడు. అందగాడు. అనూహ్య అందం, అణుకువ అతన్ని ముగ్ధుణ్ణి చేసాయి. అనూహ్యకు కూడా అతనంటే ఇష్టమేర్పడింది.

కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటావని రామారా వును డైరక్టుగా అడగడంతో ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక కూతురుకే వదిలేసాడు నిర్ణ యించుకోమని. అయితే రాజేంద్ర రామారావును అడగక ముందే అనూహ్య గురించి అన్ని విష



యాలూ తెలుసుకున్నాడని ఆ తండ్రీ, కూతుళ్ళకు తెలియదు.

"అనూహ్యా... మీరు ఎందుకు పెళ్ళిపట్ల విముఖత చూపిస్తున్నారో నాకు తెలుసు. ఒక్కొక్కరికి ఒక్కొక రకమైన కోరికలుంటాయి, ఇష్టాలుంటాయి. కొందరికి మామిడి పండంటే ఇష్టం. మరికొందరికి ఇష్టముండదు. ఒకరికి జాంపండంటే ఇష్టం. ఇంకొకరికి పడదు. మామిడి పండ్లు ఇష్టపడనివాడు, జాంపండ్లు తిననివాడు వాటి చెంతకు చేరరుగానీ ఆ చెట్లు పెరగడం ఆప

రుకదా! మీరు ఆ ఒక్క విషయం గురించే పెళ్ళిమీదే విరక్తి పెంచుకోవడం న్యాయమేనా? నాకు మీరు కావాలి. మీతోడు, మీనీడ మీప్రేమ నాకు జీవితాంతం కావాలి. మన ఇద్దరి మధ్య మరొకరికి స్థానం ఇవ్వనని మీకు హామీ ఇస్తున్నాను. నేను నడవలేని స్థితిలో మీ చేయూత, మీ అడుగులు తడబడినప్పుడు నా అండ. ఇలా ఒకరికి ఒకరం మనం ఇద్దరమే తనువులు చాలించేవరకు జీవిద్దాం"

అతని మాటలు, అతను చూపిస్తున్న ప్రేమ, అతను ఇస్తున్న గ్యారంటీకి తలవంచి మూడు ముళ్ళు వేయించుకుంది అనూహ్య. అసలు పెళ్ళిచేసుకోదని అనుకున్న బంధుమిత్రులందరూ సంతోషించారు. రామారావు పొంగిపోయాడు.

రెండు సంవత్సరాలు రెండు క్షణాలుగా గడిచిపోయాయి. అయితే అతను ఇచ్చిన గ్యారంటీ ఎందుకు అప్పుడే వెనక్కు తీసుకున్నాడో రామారావుకు అర్థంకాలేదు. తను తండ్రిని కావాలనే స్వార్థమే అతన్ని మార్చింది.

రోజులు గడుస్తున్నాయి.

అనూహ్య ముఖంలోనికి సూటిగా ఎవరూ చూడలేకపోతున్నారు. ఓ వారం అనూహ్య తండ్రితోనూ, భర్తతోనూ మాట్లాడలేదు. ఆశిక్ష చాలు ఇద్దరికీ. ఒరోజు రాజేంద్ర, "అనూహ్యా...నేను తప్పచేసాను. క్షమించు...నువ్వు మాట్లాడకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది. మీనాన్నగారిని చూడు. ఎంత డీలాపడ్డారో. నీకిష్టంలేనిది ఏది నాకు వద్దు. నాకు నువ్వు తప్ప ఎవరూ వద్దు. డాక్టర్‌తో మాట్లాడతాను అబార్షను చేయమని" అన్నాడు.

రామారావు కూడా కూతురు చేతులు పట్టుకుని," అనూహ్యా...నిన్ను చూసుకునే బ్రతుకుతున్నానమ్మా... నాలో ప్రాణం ఉన్నంతవరకు నువ్వు నా ఎదుట కళకళలాడుతుండాలి...నీకేది ఇష్టమో చెప్పమ్మా"

తండ్రి మాటకు కూడా జవాబివ్వలేదు.

నెలలు గడుస్తున్నకొద్దీ ఆ ఇద్దరికీ మనసు మనసులో లేదు. ఓ రోజు అనూహ్య రాజేంద్రను దగ్గరకు పిలిచి, నేను మీలాంటి అందమైన బాబునో, నాలాంటి పిచ్చిదాన్నో కంటాను...సరేనా..."అంది

రాజేంద్ర, రామారావు ఖంగుతిన్నారు అనూహ్య అలాఅనగానే.

ఆమె నిండు మనసుతో అనడంలో పొంగిపోయారు.

ఆమె నిండుగా నడుస్తుంటే పులకరించిపోయారు. నెలలు నిండే కొద్దీ ఇద్దరిలోనూ ఆరాటం...దిగులు. ఒకరికి తెలియకుండా ఒకరు దేవుళ్ళందరికి మొక్కారు. పూజలు చేయిస్తున్నారు. పాపో, బాబో తెలుసుకోడానికి స్కానింగ్ చేయిద్దామంటే అనూహ్య ఒప్పుకోలేదు.

"ఎవరైతేనేం...నేను హాయిగ, ప్రశాంతంగా కంటాను. బాబు అయితే నేను బ్రతుకుతాననే కదా...అమ్మాయి పుడితే. .."

అనూహ్య మాటలను పూర్తి చేయనివ్వలేదు రాజేంద్ర."అనూహ్యా...నువ్విలా మాట్లాడితే నేను భరించలేను. నాకు పిల్లలు వద్దు...నువ్వే కావాలి" అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు. నవ్వింది అనూహ్య.

ఇంకో మూడు గంటల్లో డెలివరీ వస్తుందని చెప్పింది డాక్టరు.

గదిలోపలకు తీసుకెళుతున్న నర్సును ఆపి నాన్నను పిలిచింది. అనూహ్య నాన్న చేతులు పట్టుకుని, "నాన్నా... కన్నీళ్ళతో కాకుండా నవ్వుతూ నన్ను ఆశీర్వదించు నాన్నా...నాకడుపులో బాబో, పాపోగాని రాత్రి నుండి అల్లరి చేస్తున్నారు. కాళ్ళతోనూ, చేతులతోనూ నన్ను కొడుతున్నారు. బయట ప్రపంచం చూపించమని తొందర చేస్తున్నారు. నాన్నా...నేను ఆనందంగా కంటాను. అమ్మా...అని పిలిపించుకుంటాను. నా పిల్లలను నువ్వు నన్ను పెంచినట్లే అపురూపంగా పెంచుతాను. కనిపించకుండానే బంధాలు వేస్తున్న నా బాబో, పాపో...తొందరగా చూడాలని ఉంది. నాన్నా...ఇప్పటికే ఆలస్యం చేసాను. నేను భయపడడం లేదు నాన్నా...నేను అమ్మనవుతాను.. నేనూ అమ్మనవుతాను."అంది.

అలాగే నిలబడిపోయాడు రామారావు.

అనూహ్య అమ్మమ్మ అమ్మ అమ్మమ్మను కన్న ఆరునెలలకే చనిపోయింది. అమ్మమ్మ కూడా అమ్మ పుట్టగానే చనిపోయింది. అమ్మకూడా అంతే. అనూహ్య పుట్టిన ఎనిమిది నెలలకు కాలం చేసింది. అందుకే అనూహ్య పెళ్ళికి ముందు నూతరామూ రామారావు ఇష్టపడలేదు. అనూహ్య కూడా పిల్లలు గురించి ఆలోచించనంటేనే రాజేంద్రతో పెళ్ళికి ఒప్పుకుంది.

మంచి అమ్మనై పిల్లలను పెంచుతానని, మృత్యువును ఎదురించయినా సరే తన పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాననే తాపత్రయం, నేనూ అమ్మనవుతాననే కడుపు తీపే ఆ ఇంటి శాపానికి స్వస్తి చెబుతుందని, ఆమెకు నిండు నూరేళ్ళ ఆయస్సు ఇవ్వాలని రామారావుతోపాటు మనమూ ఆ దేముడిని ప్రార్థిద్దాం.

---

## మయూరి కాంగో తిరుగుళ్ళు

మన సౌత్ సినిమాలకి సరిపోయే సరుకున్న బాలీవుడ్ నటి మయూరికాంగో అర్ధరాత్రి వరకూ క్లబ్బులు, పార్టీలు అని తిరుగుతూ తేదీ మారాకే ఇల్లు చేరుతోందట! అయినా ఛాన్సులు పెద్దగా రావట్లేదని బాధపడుతోంది. ఆ మాత్రం తిరుగుళ్ళు మనవాళ్ళతో తిరిగితే ఈపాటికి చేతిలో పది సినిమాలుండు. తోటి వాళ్ళను చూసి నేర్చుకోకపోతే ఎలా!



---

## మధుబాల పెళ్ళట!

మణిరత్నం సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుర్తింపులోకి వచ్చిన మధుబాల, హేమమాలినికి మేలువిడిచిన మేనకోడలన్న విషయం తెలిసిందే! అయితే ఇప్పుడీ మధు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో పెళ్ళి చేసుకొని సినిమాలు మానేస్తున్నానని చెప్పింది. ఈమధ్య విడుదలైన 'గణేశ్' సినిమా బహుశః తెలుగులో తన ఆఖరి సినిమా అంది. సినిమాలు మానేసినా ప్రజాహిత కార్యక్రమాలు చేస్తానంది. రాజకీయాలకి మాత్రం దూరంగా వుంటానన్నది.

